నమస్తే తెలంగాణ

# వికారాబాద్

I | హైదరాబాద్, | బుధవారం 7 మే 2025 | VIKARABAD




ఓబుళాపురం మైనింగ్ కేసులో నాంపల్లి సీబీఐ కోర్టు మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డిని నిర్దోషిగా తీర్పునిచ్చిన నేపథ్యంలో.. మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, పట్నం నరేందర్‌రెడ్డి



రైస్ మిల్ వద్ద బారులు తీరిన ధాన్యం బస్తాల వాహనాలు

# మాకెప్పుడిస్తరు..?

## కొందరికేనా రైతుభరోసా పంపిణీ..?

- వికారాబాద్ జిల్లాలో నాలుగు ఎకరాల్లోపు రైతులకే అందిన పెట్టుబడి సాయం
- మిగిలినవారికి ఎప్పుడంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న అన్నదాతలు
- జిల్లాలో అర్హులు 3,12,872 మంది..
- వ్యవసాయ ఆఫీసుల చుట్టూ చక్కర్లు కొడుతున్న మరో 86,872 మంది
- బీఆర్‌ఎస్ హయాంలో సీజన్‌కు ముందే అందిన పెట్టుబడి సాయం

వికారాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ) : అలవికాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల ప్రజలను నట్టేట ముంచుతున్నది. బీఆర్‌ఎస్ హయాంలో పదేండ్లపాటు ప్రతి సీజన్‌కు ముందే రైతు బంధు కింద పెట్టుబడి సాయాన్ని అందించి అప్పుల్లో కూరుకుపోయిన రైతులను ఆర్థికంగా ఆదుకుంటే.. మోసపూరిత హామీలిచ్చి పవర్‌లోకి వచ్చిన రేవంత్ సర్కార్ యాసంగికి సంబంధించిన రైతుభరోసా పెట్టుబడి సాయాన్ని ఇప్పటివరకు నాలుగు ఎకరాల్లోపు రైతులకే అందించి మిగిలిన వారికి మొండిచెయ్యి చూపుతున్నది. దీంతో మిగిలిన అర్హులైన రైతులు తమకు పెట్టుబడి సాయం ఎప్పుడంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ఎన్నికలకు ముందు రైతులకు పెట్టుబడి సాయాన్ని రూ.15,000 చెల్లిస్తామని ఆర్భాటంగా ప్రకటించి.. దానిని రూ.12,000లకు తగ్గించింది. అదేవిధంగా రైతు భరోసాను అన్నదాతల బ్యాంకు ఖాతాల్లో ఒకేసారి జమ చేస్తామని చెప్పి మాట తప్పింది. విడతలవారీగా.. అది కూడా మొదట మండలానికి ఒక గ్రామాన్ని చొప్పున ఎంపికచేసి.. పెట్టుబడి సాయాన్ని అందించింది. తదనంతరం ఒక్క ఎకరం, రెండెకరాలు.. ఇప్పటివరకు కేవలం నాలుగు ఎకరాల భూమి ఉన్న రైతులకు మాత్రమే పెట్టుబడి సాయాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. మిగిలినవారికి ఎప్పుడు పంపిణీ చేస్తుందో స్పష్టంగా చెప్పకపోవడంతో పెట్టుబడి సాయం జమయినట్లు ఏమైనా మెసేజ్ వచ్చిందా అని చాలామంది తమ ఫోన్లను చెక్ చేసుకుంటున్నారు. కాగా, జిల్లాలో అధికారులు అర్హులుగా గుర్తించిన రైతుల్లో ఇంకా 86,872 మందికి పెట్టుబడి సాయం అందాల్సి ఉండగా.. వారు వ్యవసాయ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మరోవైపు వానకాలం కూడా సమీపిస్తున్నప్పటికీ ఇంకా యాసంగి రైతు భరోసా సాయం అందకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కాగా, జిల్లాలో 3,12,872 మందిని అధికారులు అర్హులుగా గుర్తించి రూ.385.46 కోట్ల రైతు భరోసా సాయాన్ని అందించాలని నిర్ణయించగా, ఇప్పటివరకు నాలుగు ఎకరాల్లోపు గల 2,26,000 మంది రైతులకు రూ. 212.52 కోట్ల సాయాన్ని మాత్రమే వారి బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. మిగిలినవారికి పెట్టుబడి సాయం ఎప్పుడు జమవుతుందనేది అధికారులకు కూడా స్పష్టత లేదు. దీంతో కాంగ్రెస్ పాలనపై రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది. ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి రాగానే రైతు భరోసా సాయాన్ని పెంచుతామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ నాయకులు అర్హులందరికీ పంపిణీ చేయకుండా తాత్సారం చేయడంపై జిల్లా అంతటా అసంతృప్తి వ్యక్తం అవుతున్నది. అయితే ప్రతి సీజన్‌కు ముందే విత్తనాలు, ఎరువులను కొనేందుకు పెట్టుబడి సాయాన్ని ఠంచన్‌గా, సకాలంలో అందించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనను ఊరూరా ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.



పెట్టుబడి సాయం జమ అయినట్లు ఫోన్‌కు మెసేజ్ వచ్చిందా.. అని చూసుకుంటున్న ఓ రైతు (ఫైల్)



### బీఆర్‌ఎస్ హయాంలో సీజన్‌కు ముందే..

బీఆర్‌ఎస్ హయాంలో గుంట భూమి మొదలుకొని అర్హులందరికీ రైతుబంధు కింద పెట్టుబడి సాయం అందింది. కేసీఆర్ హయాంలో ప్రతి సీజన్‌లో 6.20 లక్షల ఎకరాల వరకు రైతుబంధు సాయాన్ని అందించగా.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా కింద పెట్టుబడి సాయాన్ని 5.80 లక్షల ఎకరాలకు కుదించింది. 2018 వానకాలంలో 1,94,833 మందికి రూ.221 కోట్లు, యాసంగిలో 1,75,989 మందికి రూ.206, 2019 వానకాలంలో 1,78,998 మంది కి రూ.255, యాసంగిలో 1,71,824 మందికి రూ.194, 2020 వానకాలంలో 2,113,341 మందికి రూ.297, యాసంగిలో 2,19,264 మందికి రూ. 301, 2021 వానకాలంలో 2,25,438 మందికి రూ.300, యాసంగిలో 2,24,928 మందికి రూ.241, 2022-23 వానకాలంలో 2,47,707 మందికి రూ.305, యాసంగిలో 2,43,447 మందికి రూ.299, 2023-24 వానకాలంలో 2,62,065 మంది రైతులకు రూ.307.47 కోట్ల పెట్టుబడి సాయాన్ని ఎకరాకు రూ.5 వేల చొప్పున నేరుగా బ్యాంకు ఖాతాల్లో కేసీఆర్ ప్రభుత్వం జమ చేసింది.

### ధాన్యం అమ్మడానికీ

# అన్నదాతలకు తప్పనితిప్పలు

### రైస్ మిల్ వద్ద బారులు తీరుతున్న వరి ధాన్యం వాహనాలు

కొడంగల్, మే 6 : కష్టపడి పండించుకున్న పంటను కూడా అమ్ముకోవడానికి రైతులు నానా తంటాలు పడుతున్నారు. పంట పండించడం ఒక ఎత్తైతే.. అమ్మడం అన్నదాతకు సవాలుగా మారింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామగ్రామాన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చేసింది. కానీ ప్రస్తుత ప్రభుత్వంతో రైతులకు కష్టాలు తప్పడంలేదు. గ్రామాల్లో ఏర్పాటైన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకాలు లేవని, కేవలం తేమ శాతాన్ని పరిశీలించి, రైతు వివరాలను సేకరించి నేరుగా మిల్‌కు ధాన్యాన్ని పంపిస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు. తద్వారా మిల్లర్లు తూకాల్లో అధిక తరుగును తీస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. ధాన్యం ఖాళీ బస్తాల కోసం వ్యవసాయ కార్యాలయం ఎదుట పడిగాపులు కాసి టోకెన్ తీసుకోవాలని, ఆ తరువాత సొంత వాహనాల్లో ధాన్యాన్ని మిల్‌కు తరలించాల్సిన పరిస్థితి నెలకొంటున్నట్లు పేర్కొన్నారు. తూకంలో నష్టపోవడంతోపాటు రవాణాపరంగా కూడా నష్టాన్ని భరించాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొడంగల్, దౌల్తాబాద్, దుద్యాల మండలాలకు సంబంధించి కొడంగల్‌లోని ఒక రైస్‌మిల్‌ను కేటాయించారని, ఎర్రటి ఎండలో క్యూలో నిలబడి పంటను అమ్ముకోవాల్సిన దుస్థితి రైతన్నకు ఏర్పడినట్లు వాపోయారు. కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని తూకం వేసి సేకరిస్తే ఈ స్థాయి ఇబ్బందులు ఉండేవి కావని, రైతుల ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

### త్వరలో నీటి సమస్యకు పరిష్కారం

నమస్తే ఎఫెక్ట్



పెద్దేముల్ మండల పరిధిలోని పాషాపూర్ తండాలో సుమారు 2వేల మంది జనాభా ఉండి, వారికి సరిపడా తాగునీరు లేకపోవడంతో నమస్తే తెలంగాణలో 'గొంతెండిపోతున్నది' అనే శీర్షికతో వార్త ప్రచురితం కావడంతో స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాషాపూర్ తండాను సందర్శించారు. గ్రామంలో నెలకొన్న నీటి సమస్యను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడెక్కడ సమస్య ఉందో నోట్ చేసుకొని, పంచాయతీ కార్యాలయం వద్ద మాజీ సర్పంచ్, గ్రామస్తుల సమక్షంలో ప్రభుత్వం ద్వారా మంజూరైన రెండు బోర్లకు సంబంధించిన ప్రొసీడింగ్‌ను చూపించారు. త్వరలో గ్రామంలో నీటి సమస్య పూర్తిగా తొలగిపోతుందని అధికారులు తెలిపారు. - పెద్దేముల్, మే 6



యాచారం తహసీల్దార్ కార్యాలయంలో ఫార్మా రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో అనంతరెడ్డి

### సమస్యలు పరిష్కరించకుంటే

# ఫెన్సింగ్ పనులను అడ్డుకుంటాం

- ఆర్డీవో సమావేశంలో రైతుల వెల్లడి
- మేడిపల్లి, నానక్‌నగర్ గ్రామాలకు చెందిన ఫార్మా రైతులతో సమావేశం

యాచారం, మే 6 : ఫార్మా భూ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించుకుంటే భూముల చుట్టూ కంచె ఏర్పాటు పనులను అడ్డుకుంటామని రైతులు స్పష్టం చేశారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా యాచారం తహసీల్దార్ కార్యాలయంలో పట్నం ఆర్డీవో అనంతరెడ్డి మండలంలోని మేడిపల్లి, నానక్‌నగర్ గ్రామాలకు చెందిన ఫార్మా రైతులతో సమావేశాన్ని ఏర్పాటు చేయగా.. తమ సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆర్డీవోను నిలదీశారు. అసైన్డ్ భూములకు డబ్బులు చెల్లించకుండా పీవోటీ పేరుతో అక్రమంగా ఫెన్సింగ్ వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఫార్మాసిటీకి భూములిచ్చిన రైతులకు పూర్తిస్థాయిలో డబ్బులు చెల్లించేవరకు.. ఆ భూముల చుట్టూ కంచె ఏర్పాటు చేయొద్దని తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. అసైన్డ్ భూముల చుట్టూ ఫెన్సింగ్ వేస్తున్నామని.. ఆ పనులను అడ్డుకోవద్దన్నారు. బాధిత రైతులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా, రైతులు ఇంటి స్థలంతోపాటు నష్టపరిహారాన్ని పెంచి ఇవ్వాలని పట్టుబట్టారు. ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. దీంతో రైతులు తమ సమస్యలు పరిష్కరించిన తర్వాతే సర్వే చేసిన భూములకు కంచెను ఏర్పాటు చేసుకోవాలని.. అప్పటివరకు వాటి జోలికి రావద్దని కోరారు. కార్యక్రమంలో ఫార్మా వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు గణేశ్, సందీప్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, మంగమ్మ, మేడిపల్లి, నానక్‌నగర్ గ్రామాలకు చెందిన రైతులున్నారు.

### భూమికి భూమైనా ఇవ్వండి.. లేదా

# పరిహారాన్ని పెంచండి

- గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్డు భూ బాధితుల డిమాండ్
- కొంగరకలాన్‌లో గ్రామసభ
- ప్రభుత్వ నిర్ణయం ప్రకారమే పనిచేస్తామన్న రంగారెడ్డి అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్




గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్డు ఏర్పాటులో భూములు కోల్పోతున్న రైతుల వివరాలను పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

ఆదిబట్ల, మే 6 : భూమికి భూమైనా ఇవ్వండి.. లేదంటే నష్టపరిహారాన్ని పెంచాలని 100 మీటర్ల గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్‌లో భూములు కోల్పోతున్న బాధిత రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్ గ్రామంలో 100 మీటర్ల గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్ ప్రాజెక్ట్ నిర్మాణ నిమిత్తం.. ప్రభుత్వం రావిరాల ఎగ్జిట్-13 నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు ఫేజ్-1 రోడ్డును 18.5 కిలో మీటర్ల పొడవులో ఏర్పాటు చేసేందుకు భూసేకరణ, నష్టపరిహారం, పునరావాసం, ఉపాధి కల్పన కోసం కొంగరకలాన్, ఫిరోజ్‌గూడ గ్రామాల రైతులతో గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతులు అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భూసేకరణ అధికారి రాజుతో తమ బాధను చెప్పుకొన్నారు. ఇప్పటికీ ఎంత భూమి పోతుందో చెప్పడం లేదని.. ఎంత పరిహారమూ చెల్లిస్తారో సమాచారం లేదన్నారు. గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ముందస్తు సమాచారం కూడా ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూములకు పక్కనే ఉన్న రావిర్యాల గ్రామ రెవెన్యూ భూములకు ప్రభుత్వం రూ.30 లక్షలు చెల్లిస్తున్నదని.. వాటితో పోల్చుకుంటే మూడు రేట్లు ఎక్కువ ధర చెల్లించి నష్టపరిహారమివ్వాలని డిమాండ్ చేశారు. రోడ్డు వెడల్పులో తమ పేరున ఉన్న భూములే పోతున్నాయని గ్రామానికి చెందిన 10 మంది రైతులు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గతంలో ఫాక్స్‌కాన్, కేన్స్ కంపెనీల ఏర్పాటులోనూ భూములు పోయాయని.. కనీసం ఇప్పుడున్న భూములు మిగులుతాయనుకుంటే అవి కూడా నేడు గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్ పేరుతో గుంజుకుంటున్నారని వాపోయారు. గతంలో తీసుకున్న భూములకు ఇప్పటికీ పరిహారం రాలేదని.. వాటికైనా నష్టపరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతులు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. గతంలోనే కొంగరకలాన్, ఫిరోజ్‌గూడ గ్రామాలలోని సర్వే నంబర్లు 300, 298, 294, 286, 287, 285, 289, 290, 291, 283 లలో 55 ఎకరాల 5 గుంటలు, ఫిరోజ్‌గూడలోని సర్వే నంబర్ 84లో 2 ఎకరాల 20 గుంటల భూమి మొత్తం 57 ఎకరాల 25 గుంటల భూమిని 42 మంది రైతుల నుంచి సేకరించి హద్దులు కూడా పాతామని గ్రామంలోని నోటీసు బోర్డులో అతికించామని అధికారులు తెలిపారు.

### చట్ట ప్రకారం ముందుకు పోతాం

ప్రభుత్వ నిర్ణయం ప్రకారమే పని చేస్తామని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. గ్రామ సభకు విచ్చేసి గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్డు భూ బాధితులతో మాట్లాడారు. బాధితులు కొన్ని సమస్యలను ఆమె దృష్టికి తీసుకురావడంతో వెంటనే పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. రేడియల్ రోడ్డులో 100 శాతం భూములు కోల్పోతున్న బాధిత రైతులు, ఆ భూములపై పూర్తిగా ఆధారపడి జీవనం సాగిస్తున్న కుటుంబసభ్యులకు (18 సంవత్సరాలు నిండినవారు) ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద 5లక్షల50వేల రూపాయలను చెల్లించడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. అందుకే గ్రామంలో గ్రామ సభ ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు ఎంత చెల్లించాలో ప్రభుత్వం త్వరలోనే నిర్ణయిస్తుందని.. చట్ట ప్రకారం ముందుకుపోతామని తెలిపారు.

### మా భూములే దొరికాయా..?



మా పేదోళ్ల భూములే దొరికాయా.. ఉన్నోళ్ల భూముల జోలికి పోతలేరు. గతంలో ఇక్కడ ఏర్పాటు చేసిన ఫాక్స్‌కాన్, కేన్స్ కంపెనీలకు 8 ఎకరాల భూమి గుంజుకుంద్రు. ఇప్పటికీ నష్టపరిహారం ఇవ్వలేదు. ఇప్పుడున్న ఒక ఎకరం 38 గుంటల భూమిని కూడా రోడ్డు కోసం తీసుకుంటున్నరు. ఇప్పటికైనా మాకు భూమికి భూమైనా ఇవ్వండి. లేదంటే నష్టపరిహారం పెంచి ఇవ్వాలి. ఇవ్వకుంటే మా బతుకులు రోడ్డు మీదకు వస్తాయి సారూ..

**- కౌశిక కోటయ్య, భూ బాధితుడు, కొంగరకలాన్**

### తరి పొలం తీసుకుంటుండ్రు



గతంలో మాకున్న 8 ఎకరాల 20 గుంటల భూమి ఫాక్స్‌కాన్, కేన్స్ కంపెనీల ఏర్పాటులో పోయింది. ఇప్పుడు సర్వే నంబర్ 300లో ఉన్న 4 ఎకరాల తరి పొలం తీసుకుంటుండ్రు. అందులో రోడ్డు ఏస్తరంట. కనీసం ఎకరాకు ఎంత నష్టపరిహారం ఇస్తరో, ఎంత భూమి పోతుందో కూడా చెప్పడంలేదు. అధికారులు గుట్టుచప్పుడు కాకుండా సర్వేలు చేస్తున్నారు. గ్రామ సభలు పెడుతున్నరు. ఇప్పటికైనా ప్రతి రైతుకూ నోటీసులు ఇవ్వాలి.

**- కౌశిక యాదయ్య, భూ బాధితుడు, కొంగరకలాన్**




డిమాండ్ల వినతిపత్రాన్ని భూసేకరణ అధికారికి అందజేస్తున్న భూ బాధిత రైతులు

నాడు.. నేడు

### బీఆర్‌ఎస్ హయాంలో పచ్చని మొక్కలతో కళ కళ లాడుతూ..




# నాడు పచ్చదనం.. నేడు దుర్భిక్షం

### కాంగ్రెస్ పాలనలో ఎండిపోయి కళావిహీనంగా మారి..




మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనంలోని మొక్కలు అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ కొరవడడంతో ఎండిపోతున్నాయి. గత బీఆర్‌ఎస్ హయాంలో పచ్చని మొక్కలతో కళ కళ లాడిన పల్లెప్రకృతివనం.. నేడు సరిపడా నీళ్లు అందక మొక్కలు ఎండిపోతున్నాయి. - కులకచర్ల, మే 6